క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ప్రసంగిస్తున్న కమలానందభారతి స్వామీ

బొబ్బిలి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి స్వామీ అన్నారు. స్థానిక సంస్థానం ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం జరిగిన హిందూ ధార్మిక ప్రవచనాలు కార్యక్రమంలో ఆయన పాల్గొని, భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రతిఒక్కరూ తమ ఖాళీ సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలని తెలిపారు. ప్రపంచ శాంతి కోసం అందరూ భక్తిభావంతో మెలగాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు

సంతకవిటి: మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని, ప్రతిఒక్కరూ మద్యం, గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గరికిపాడు గ్రామంలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి యువత, విద్యార్థులు ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలు చెడగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ మంచి అలవాట్లు అలవర్చుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

రోడ్ల మరమ్మతులకు చర్యలు

వంగర: మండలంలోని పలు గ్రామాల రోడ్ల మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించి, ఆర్అండ్‌బీ శాఖ ద్వారా నిధులు మంజూరయ్యాయి. బూరాడ నుంచి వంగర, అరసాడ నుంచి మరువాడ, వంగర నుంచి వీవీఆర్‌పేట, వీవీఆర్‌పేట నుంచి కొత్తూరు, కె.కొత్తవలస నుంచి కొప్పర తదితర గ్రామాల రోడ్లలోని గుంతలు పూడ్చేందుకు పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పిక్కరాయి వేసే పనులు జరుగుతున్నాయని ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు తెలిపారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో పుస్తకాలు ఏ విధంగా చదివి అర్థం చేసుకోవాలో లైబ్రేరియన్ నేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదివితే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లోనూ తర్ఫీదు పొందాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులంతా చేరాలని కోరారు.

సస్యరక్షణ చేపట్టాలి

బాడంగి: అపరాల పంటలకు తెగుళ్ల సోకకుండా సస్యరక్షణ చేపట్టాలని మండలంలోని రేజేరు గ్రామ వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) సాయికుమార్ సూచించారు. ఏవో శిరీష ఆదేశాల మేరకు మండలంలోని రేజేరు, పినపెంకి గ్రామాల్లో పెసర, మినుము తదితర అపరాల పంటల రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం అవగాహన కల్పించారు.

వితరణ

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ అదే గ్రామంలోని వృద్ధులకు స్వెటర్లు(చలికోట్లు) ఆదివారం అందజేశారు. రాహుల్ సౌరబ్ అనే వ్యక్తి ఇక్కడి నిత్యాన్నదాన సత్రంలో రోజూ భోజనం చేసే నిరుపేదలకు వీటిని వితరణ చేసినట్లు ఆయన తెలిపారు.

20 మద్యంసీసాలు స్వాధీనం

బొబ్బిలి: మండలంలోని కలువరాయి గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న 20 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ జి.భాస్కరరావు ఆదివారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి చింతాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

జూదరుల అరెస్ట్

బొబ్బిలి: పట్టణ శివారులోని అప్పయ్యపేట, పాత సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న తోటల్లో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు(జూదరులు)ను పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితులన నుంచి రూ.17,980లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్ తెలిపారు. దాడి చేసిన వారిలో ఏఎస్ఐ జి.భాస్కరరావు తదితరులు ఉన్నారు.

వలంటీర్‌ల ఆశలపై నీళ్లు!

- వలంటీర్లకు కూటమి ప్రభుత్వం షాక్
- అసలు వలంటీర్ వ్యవస్థే లేదని తేల్చి చెప్పిన మంత్రి బాలవీరాంజనేయస్వామి
- ఎన్నికలకు ముందు రూ.10 వేలు ఇచ్చి, కొనసాగిస్తామని చంద్రబాబు హామీ
- ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్న వలంటీర్లు



కూరగాయల దుకాణం పెట్టుకున్న వలంటీర్ సత్యనారాయణ

వలంటీర్ల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లుతోంది. ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇచ్చి, కొనసాగిస్తామని చెప్పిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం వలంటీర్ల కొనసాగింపుపై ఇప్పటివరకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీనికి తోడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామిలు అసలు వలంటీర్ వ్యవస్థే లేదని అబద్ధాలు చెప్పడంతో తమ కొలువులపై గంపెడాశలు పెట్టుకున్న వలంటీర్లు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఏమిటీ దారుణం ఎన్నికలప్పుడు నాయకులు ఇచ్చిన మాటలు నీటిమూటలేనా అని మండిపడుతున్నారు.



రామభద్రపురం బైపాస్ రోడ్డులో పాన్‌షాపు నిర్వహిస్తున్న వలంటీర్

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఎంతో కొంత ఉపాధి కల్పించేలా గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చింది. గ్రామ, వార్డు స్థాయిల్లో ప్రతీ రెండు వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున ఏర్పాటు చేసి, ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు చేరవేసేందుకు ప్రతీ యాభై ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించింది. సచివాలయాల్లోని ఉద్యోగులకు తోడుగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు విశేష సేవలందించారు. అటువంటి వలంటీర్ వ్యవస్థ పూర్తిగా లేకుండా చేసేందుకు ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మెల్లమెల్లగా వారి పార్టీ నాయకులతోనే అసలు వలంటీర్ వ్యవస్థే ఉండదని చెప్పిస్తోంది. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చంద్రబాబు వలంటీర్ వ్యవస్థను ఇలాగే కొనసాగిస్తామని, వారి గౌరవ వేతనాన్ని కూడా రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చి, ఐదు నెలలవుతున్నా తమకు ఇచ్చిన హామీపై ఎటువంటి స్పష్టత లేకపోవడంతో వలంటీర్లంతా ఆందోళన చెందుతున్నారు. ఎవరిని అడగాలో.. ఏం చేయాలో తెలియక వారిలో వారే మదనపడుతున్నారు. చంద్రబాబు, పవన్‌ల మాటలు నమ్మి మోసపోయామని లబోదిబోమంటున్నారు.

మోసం చేయాలనుకోవడం తగదు..



ఎన్నికలప్పుడు ఇదే కూటమి ప్రభుత్వం వలంటీర్లను కొనసాగిస్తామని మాట ఇచ్చింది. ఇప్పుడేమో వీలు కాదంటోంది. ఇదెక్కడి న్యాయం ప్రజలే గమనించాలి. ఎన్నికల్లో గెలవడానికి ఎలాంటి హామీలు ఇచ్చి అయినా మోసం చేయాలనుకోవడం తగదు.

– పెద్దింటి ఈశ్వరరావు, వలంటీర్, రామభద్రపురం

మంత్రి మాట మార్చడం బాధేసింది..



తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెలకు రూ.10 వేల జీతమంటూ చెప్పింది కూటమి నేతలే. ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థను కొనసాగించలేమంటూ మంత్రి చెప్పడం చూసి చాలా బాధేసింది. ఇచ్చిన మాటలు నిలబెట్టుకోకుంటే ఎలా.. మరీ ఇంత అన్యాయమా.

– బిల్లాన శ్యామలరావు, వలంటీర్, కొండకెంగువ

ఏరు దాటాక తెప్ప తగలేసిన రకం..

ఏరు దాటాక తెప్ప తగలేసిన చందాన(రకంగా) ప్రస్తుత సీఎం చంద్రబాబు వ్యవహార శైలి ఉందని వలంటీర్లు నిప్పులు చెరుగుతున్నారు. ఎన్నికలకు ముందు వలంటీర్లను కొనసాగిస్తా.. వారికిచ్చే గౌరవ వేతనం రూ.5 వేలు ఏ మూలకు సరిపోతుంది.. దానిని రూ.10 వేలు చేసి ఇచ్చే బాధ్యత నాది అని ఊదరగొట్టిన చంద్రబాబు నేడు నోరు మెదకపోవడంపై వలంటీర్లు కన్నెర్ర చేస్తున్నారు. అసలు వలంటీర్ వ్యవస్థే లేదంటూ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలశ్రీ బాలవీరాంజనేయస్వామి శాసన మండలిలో మాట్లాడడంపై వలంటీర్లు మండిపడుతున్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



దినసరి కూలీగా మార్కెట్‌లో ఉల్లిపాయలు విక్రయిస్తున్న వలంటీర్ పూడి రాజేశ్వరి

ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి రామభద్రపురం గ్రామంలోని పూడి వీధికి చెందిన పూడి రాజేశ్వరి. ఈమెను గత ప్రభుత్వం వలంటీరుగా నియమించింది. అప్పట్లో ప్రభుత్వం ప్రతినెలా అందజేసిన రూ.5 వేలతో కుటుంబ పోషణ చేసుకునేది. అయితే ఇటీవల ఈమె భర్త అనారోగ్యంతో మృతి చెందడం, కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక వలంటీర్ల వ్యవస్థపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. మార్కెట్‌లో ఉల్లిపాయలు విక్రయించే వ్యాపారి వద్ద దినసరి కూలీగా చేరింది. వ్యాపారి ఇచ్చిన అరకొర కూలీతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ప్రభుత్వమే వలంటీర్ వ్యవస్థను కొనసాగించి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది.

దినసరి కూలీలుగా..

వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తారా లేదా కొనసాగించరా అనే అంశంపై కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో వలంటీర్లంతా బతుకు తెరువు కోసం దినసరి కూలీలుగా మారాల్సిన దుస్థితి నెలకొంది. కుటుంబ పోషణ కోసం చిరు వ్యాపారుల వద్ద కూలీలుగా చేరడం, కొద్దో గొప్పో అవకాశం ఉన్న వారు సొంతంగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నారు.

సామాజిక సమస్యలు ఎత్తిచూపే రచనలు రావాలి



వేకువ కథాసంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రారవే సభ్యులు

రాజాం సిటీ: సామాజిక సమస్యలను ఎత్తిచూపే రచనలు రావాలని ప్రముఖ నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడు కోరారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 118వ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన ఆయన.. ధనికులు, అధికారులు, నాయకులు, పోలీసులు వంటి ఆధిపత్య వర్గాల వారు కిందస్థాయి వర్గాల ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తుంటారని, అలాంటి బాధితుల పక్షాన కవులు రచనలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమాజంలో నెలకొన్న అనేక రుగ్మతలను, సమస్యలను ప్రస్తావిస్తూ, వీలైతే వాటికి పరిష్కార మార్గాలను కూడా చూపుతూ రచనలు చేయాలన్నారు. ఈ నేల మీద మూలవాసులను, ఆదివాసులను తరిమి ఆయా ప్రాంతాలను ఆధిపత్య వర్గాల వారు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని దాని పర్యవసానమే అడవుల్లో ప్రస్తుతం జరుగుతున్న పోరాటమన్నారు. అంతకుముందు డాక్టర్ మజ్జి భారతి రచించిన 'వేకువ' కథా సంపుటి పుస్తకాన్ని మజ్జి చంద్రినాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రారవే నిర్వాహకుడు గార రంగనాథం, కథా రచయిత గంటేడ గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరినీ ఓటర్లుగా చేర్పించండి



తెర్లాం: రాజయ్యపేటలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దారు హేమంత్‌కుమార్



ఓటరు జాబితా పరిశీలిస్తున్న తహసీల్దారు రాజు

తెర్లాం: అర్హులైన యువతీ, యువకులందరినీ ఓటర్లుగా చేర్పించాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ సూచించారు. మండలంలోని రాజయ్యపేట, నందిగాం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఆయన ఆదివారం వెళ్లి ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఇంతవరకు ఎంతమంది కొత్తగా ఓటర్లుగా చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారని బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి, అన్ని వివరాలు సక్రమంగా ఉన్నవీ, లేనివీ సరిచూసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దారు జి.సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

రాజాం సిటీ: పట్టణంతో పాటు మండలంలో నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు ప్రక్రియను తహసీల్దారు ఎస్‌కే రాజు ఆదివారం పరిశీలించారు. మారెడుబాక గ్రామంలో నమోదైన ఓటర్ల లిస్టును ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. 82 పోలింగ్ బూత్‌ల పరిధిలో 46 మంది కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 284 పోలింగ్ బూత్‌ల పరిధిలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 132 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు.

నాయకత్వ లక్షణాలకు ఎన్‌సీసీ దోహదం



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ జెండా ఆవిష్కరించి, గౌరవ వందనం చేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఎన్‌సీసీ(నేషనల్ క్యాడెట్ కార్ప్స్) ఎంతగానో దోహదపడుతుందని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తూ సమాజంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొని, ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ బీవీ అచ్యుత్‌కుమార్ మాట్లాడుతూ నవంబర్ 4వ తేదీన అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎన్‌సీసీ జెండా ఆవిష్కరించి, పలువురు ఉత్తమ క్యాడెట్‌లకు అవార్డులతో పాటు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సామంతుల శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



జగన్నాథంను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



రాజాం: పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు గెద్ద జగన్నాథం భార్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి జగన్నాథం ఇంటికి వెళ్లి, పరామర్శించారు. అనంతరం ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు, నాయకులు కనిమెరక అప్పారావు, పూడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో ఇటీవల మృతి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు శాసపు అప్పలనాయుడు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ ఆదివారం పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, గార సత్యనారాయణ, గోకవలస బాబూరావు, ఇనుమల శ్రీనివాసరావు, సామంతుల ప్రసాద్, దూబ మహేష్ తదితరులు ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గపు విధానాలు తిప్పికొట్టాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, జిల్లా రైతు సంఘం నాయకుడు వి.లక్ష్మణ్‌నాయుడు



బొబ్బిలి: ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

రామభద్రపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గపు విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26వ తేదీన బొబ్బిలిలోని ఎన్‌టీఆర్ బొమ్మ సెంటర్‌లో నిర్వహించనున్న నిరసన, ఆటో ప్రచార కార్యక్రమాలకు అందరూ తరలిరావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, జిల్లా రైతు సంఘం నాయకుడు వి.లక్ష్మణ్‌నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్ వద్ద ఆటో కార్మికులతో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ అటు దేశంలోనూ ఇటు రాష్ట్రాల్లోనూ సంపద సృష్టిస్తున్న కార్మికులకు, ప్రజలకు తిండి పెడుతున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. గత పదేళ్లలో బీజేపీ కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్ల రుణమాఫీ, పన్ను రాయితీ ప్రోత్సహకాల రూపంలో ప్రజాధనాన్ని కేంద్రం దోచి పెట్టిందని మండిపడ్డారు. రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దని డిమాండ్ చేశారు. దుర్మార్గమైన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరారు. నిత్యావసరాల ధరలు అదుపు చేయాలని, స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణను ఆపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని, అందరూ సన్నద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు పిలుపునిచ్చారు. ఈ నెల 26వ తేదీన చేపట్టే నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ఇదే విషయమై ఆయన ప్రజాసంఘాల నేతలతో కలిసి స్థానిక పట్టణంలో ఆదివారం ఆటో ప్రచారం చేపట్టారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రజాధనం ధారబోస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం కూడా నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీల ధరలు పెంచుతూ సామాన్య ప్రజలను కష్టాలపాలు చేస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు మునకాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

బాడంగి: మండలంలోని కోడూరుకు చెందిన కొల్లి అప్పలనాయుడును రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినందుకు గాను ఆ గ్రామస్తులు సన్మానించారు. డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసి, ఆదివారం స్వగ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు సాదర స్వాగతం పలికి, సత్కరించారు.

రాజాం: సీనియర్ జర్నలిస్టుగా కల్లేపల్లి శ్రీనివాసరావు అందించిన సేవలు అభినందనీయమని శిష్టకరణ సంఘం అధ్యక్షు, కార్యదర్శులు పక్కి వాసు, కుప్పిలి సాయిరమేష్ అన్నారు. స్థానిక పాలకొండ రోడ్డులో నిర్వహించిన వనసమారాధనలో శ్రీనివాసరావును ఆదివారం సత్కరించారు. 30 ఏళ్లుగా జర్నలిజంలో ఉత్తమ సేవలు అందించడం గొప్ప విషయమని ప్రశంసించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాజాం అప్పలనర్సయ్య, బలివాడ సూర్యనారాయణ, వాండ్రంగి నాగభూషణరావు, వప్పంగి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని, అలాంటప్పుడే ఆదర్శవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుందని ఆధ్యాత్మిక వక్తలు ఎన్వీ రమణ, జడ్డు జగ్గారావు, కిమిడి సత్యనారాయణలు అన్నారు. మండలంలోని రేగిడి గ్రామంలో ఆదివారం జరిగిన ఆధ్యాత్మిక సభకు వారు హాజరై, కాసేపు ప్రసంగించారు. పుణ్యతీర్థాలు, క్షేత్రాలు సత్సంగానికి సాటి రావన్నారు. ఎక్కడైతే సత్సంగం జరుగుతుందో అక్కడ ఆధ్యాత్మికత వెల్లువిరుస్తుందన్నారు. అనంతరం దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు ఆధ్వర్యంలో దత్త పాదుకా పూజ, గణపతి హోమం, ఆధ్యాత్మిక వేత్తలకు సత్కారాలు వంటివి చేశారు. కార్యక్రమంలో దామోదరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను భద్రంగా ఉంచాలి

తెర్లాం: తహసీల్దారు కార్యాలయంలో ఎప్పటి నుంచో ఉన్న రెవెన్యూ రికార్డులను భద్రంగా ఉంచాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేసే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. రికార్డు గదిలో ఏయే రికార్డులు ఎప్పటి నుంచి ఉన్నాయి, వాటికి సంబంధించిన వివరాలు ఏమిటనే అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రికార్డు గదిలోని ప్రతీ రికార్డు, ఇతర పుస్తకాలను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి, అవసరమైన వాటిని భద్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ రికార్డు, ఫైల్ పైనా వాటికి సంబంధించిన వివరాలు రాసి, ఉంచాలని కార్యాలయ సిబ్బందిని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దారు సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 43 మంది ఎంపిక



వృద్ధురాలి కళ్లను పరీక్షిస్తున్న వైద్యురాలు సత్యవతి

బాడంగి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన కంటి రోగులకు వైద్య సిబ్బంది తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అయితే శిబిరానికి వచ్చిన 75 మందిలో మొత్తం 43 మందికి శస్త్రచికిత్స అవసరమైనట్లు గుర్తించామని క్యాంపు నిర్వాహకుడు వెంకటరమణ తెలిపారు. ఆపరేషన్ల కోసం వారిని ప్రత్యేక బస్సులో విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించామన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై పునరాలోచించాలి



ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చన్న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పునరాలోచన చేయాలని దళిత బహుజన సంఘాల నేతలు మజ్జి గణపతి, చిత్రి గంగులు, దర్రు రాంబాబు, రామారావులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా వంగర మండల కేంద్రంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలల గర్జన కార్యక్రమ పోస్టర్లు ఆదివారం ఆవిష్కరించారు. సుప్రీం ధర్మాసనం ఇచ్చిన తీర్పును నిలుపుదల చేయాలని అభ్యర్థిస్తూ ఈ నెల 29వ తేదీన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోనూ, డిసెంబరు 8వ తేదీన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కేంద్రంలో జరిగే ఈ మాలల గర్జనకు దళితులంతా హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. – వంగర

రైతుల్లో తుపాను భయం



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారానికి వాయుగుండంగా మారనుందని వాతావరణ హెచ్చరికల కేంద్రం తెలిపిన నేపథ్యంలో రైతుల్లో గుబులు నెలకొంది. కొన్నిచోట్ల వరికోతలు జరుగుతుండగా, మరికొన్ని చోట్ల కోసిన చేను పొలాల్లోనే కుప్పలుగా ఉండిపోయాయి. ఇంకొన్ని చోట్ల నూర్పిడి చేసిన ధాన్యం సైతం కళ్లాల్లోనే ఉండిపోవడంతో ఏ క్షణాన వర్షం పడి, పంట పాడైపోతుందోనని భయాందోళన చెందుతున్నారు. పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నంలో రైతులు ఆదివారం నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే ఈ భయం ఉండేది కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. – రేగిడి

గ్రావెల్ తవ్వకాలు అడ్డగింత



బొబ్బిలి మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలో అక్రమంగా చేపడుతున్న గ్రావెల్ తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. శనివారం రాత్రి గ్రామంలోని చెరువుల్లో నుంచి మట్టి, కంకరను తరలించేందుకు వెళ్తున్న ఓ జేసీబీ, రెండు ట్రాక్టర్లను పట్టుకుని, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అధికార పార్టీకి చెందిన నాయకులే ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతీ శని, ఆదివారాల్లో ఈ పని చేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా వారి ఆగడాలు ఆగడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్లంపేట, గొర్లెసీతారాంపురం, కోమటిపల్లి, రంగరాయపురం గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. తహసీల్దారు శ్రీను స్పందిస్తూ అక్రమార్కులపై చర్యలకు మైనింగ్ విజిలెన్స్ అధికారులకు ఈ కేసు అప్పగిస్తున్నామన్నారు.

– బొబ్బిలిరూరల్